
# Ms. మయూర



సాయంకాలపు చివరి నీరెండ నారింజ వర్ణపు కిటికీ తెరల నుంచి గదిలోకి యేట వాలుగా పర్చుకొంది. గదంతా వెలుగుతోన్న కొవ్వొత్తి పరిమళం. యే.సి. చల్లదనపు సవ్వడి. పచ్చని, నున్నని శరీరంపై లెవెండర్ ఆయిల్‌తో అతి మృదువుగా కదుల్తోన్న చామనఛాయ చేతివేళ్ళు.

తేలికవుతోన్న తనువు. బరువెక్కుతోన్న మనసు. యే ఆయిల్‌తో మసాజ్ చేస్తే యీ హృదయపు బరువు తీరునో... ప్రేమ... ప్రేమ జిడ్డులాంటిది. క్లాస్‌మేట్ సుహాసిని జోక్ గుర్తొస్తోంటే మయూర పెదవులపై చిరునవ్వు.

స్టీమ్‌బాత్‌లో వెచ్చదనాన్ని కొన్ని క్షణాలు ఆస్వాదించి చల్లని నీటితో స్నానం చేసింది. చన్నీళ్ళ స్నానం వొంటి రంగుని మెరిపిస్తుందనే చిట్టి చిట్కాని స్త్రీల పేజీలో చదివినా ఆచరణలో పెట్టింది మాత్రం కొద్ది నెలలుగానే... అవసరం అలాంటిది.

జీన్స్‌పై ఆరంజ్ కలర్ లాంగ్ కుర్తా వేసుకొని డ్రయర్‌తో జుట్టు ఆరపెట్టుకుంటూ అద్దంలో తన ప్రతిబింబాన్ని పరిశీలనగా చూసుకొంది మయూర నిగనిగలాడు తున్న ఫ్రెష్‌లుక్ స్కిన్.

కళ్ళ చుట్టూ కాస్త నలుపు. కీరానో ఆలూనో చక్రాలుగా కట్ చేసి కనురెప్పలపై పెడుతున్నా ఆ నలుపు తగ్గడంలేదు. చిరుబొజ్జ... 'అన్నం, స్వీట్లూ మానేసి సలాడ్లు తింటున్నా యీ చిట్టిపొట్ట తగ్గడం లేదేంటో,' దిగులుగా అనుకొంది.

తనేమైనా యిరవై యేళ్ళ అమ్మాయా... నలభై నిండాయి. మరీ ఫ్లాట్‌గా పొట్ట యెలా సాధ్యం... అప్పటికీ యోగా, జిమ్, ధ్యానం... డైట్... రోజంతా శరీరం ఆకర్షణీయంగా వుండేందుకు శ్రమపడటంతోనే సరిపోతోంది. 'హోహ్... ఫ్రూట్ జ్యూస్ తాగే టైమ్ అవుతోంది,' అనుకొంటూ గదిలోంచి హాల్లోకి వచ్చింది.

చిన్నాడపడుచు గీత, మావగారు హాల్లో టి.వి. చూస్తున్నారు. వంటగదిలోకి వెళ్ళి ఫ్రిజ్ తెరిచి ఆరెంజ్ జ్యూస్ తీస్తుంటే మయూరకి ఆ పాట వినిపించింది. గుండె వేగంగా కొట్టుకుంది. హాల్లోకి వచ్చింది. 'యెంత బావుందో,' అంటోంది గీత.

'సరయూనా... యెంత మర్యాద, యెంత గౌరవం,' అప్పుడే గుడి నుంచి వచ్చిన సువర్చలగారు మురిపెంగా అన్నారు.

పొడవుగా, నాజూగ్గా మత్తెక్కించే యిరవైయేళ్ళ శరీరం... ముఖంలో రవ్వంత అమాయకత్వమైనా లేదు... కవ్వింపు తప్ప.

ఆరోజు ప్రసన్న పుట్టినరోజు. యింట్లోవాళ్ళు, చాలా దగ్గర స్నేహితులు మాత్రమే రావడం చాలా యేళ్ళుగా అలవాటు. కాని ఆరోజు సరయు కూడా వచ్చింది. అత్తయ్య, మామయ్యగారు, గీత ఆమెతో ఆత్మీయంగా వున్నారు. వాళ్ళందరికీ

ఆమెతో యింతకుముందే పరిచయం వుందని అర్థమయ్యింది. యెవ్వరూ యెప్పుడూ చెప్పలేదు. యెంటర్‌టైన్‌మెంట్ మీడియాలో పనిచేస్తున్నా ప్రసన్న యెప్పుడూ యింటికి యెవ్వర్నీ తీసుకురాలేదు. యెప్పట్నించో వున్న యిద్దరు ముగ్గురు స్నేహితుల్ని తప్ప. ప్రసన్న ఆమెని పరిచయం చేశాడు. ఆమె పలకరింపుగా నవ్వింది.

యింట్లో యే పార్టీ అయినా, పండగైనా, వ్రతాలైనా అత్తయ్యగారు బిజీగా వుంటారు. దాదాపు అంతా ఆమె స్నేహితులు, బంధువర్గం వాళ్ళే. అన్నీ వొకసారి సిద్ధమయ్యాక పెద్దగా పనేం లేక వూరికే అటూయిటూ తిరగలేక కూర్చున్నా. కళ్ళు ప్రసన్న కోసం వెతికాయి. హాలుకి ఆనుకుని వున్న బాల్కనీలో సెల్‌ఫోన్‌లో మెసేజ్ టైప్ చేస్తూ కనిపించాడు. అతని చేతివేళ్ళ కదలిక ఆగగానే హాల్లో గీత పక్కన కూర్చున్న సరయూ సెల్‌ఫోన్‌లో యెస్‌యెంయెస్ అలర్ట్ సవ్వడి వినిపించింది. ఆమె వైపు చూస్తున్నా... ఆమె కళ్ళల్లో నవ్వు. ఆమె టైప్ చేయడం ఆగగానే అతని యిన్‌స్ట్రుమెంట్‌లో అలర్ట్ వినిపించింది. అలా నాలుగైదుసార్లు వినిపించాయి. అతను యింటికి ఆలస్యంగా రావడం చాలా యేళ్ళుగా వుంది. కానీ యీమధ్య మరీ ఆలస్యంగా రావడం, వొక్కోసారి అసలు రాకపోవడం, అసలే బిజీ అయిన ఫోన్ మరింత బిజీ కావడం, యింట్లో దూరంగా వెళ్ళి మాట్లాడ్డం... సెలవు రోజుల్లో అసలు యింట్లో వుండకపోవడం... రాత్రుళ్ళు వచ్చినప్పుడు పల్చగా వస్తున్న పెర్‌ఫ్యూమ్ పరిమళం... అలాంటి పరిమళమే యిప్పుడు సరయూ నుంచి రావడం... వీటన్నిటితో మనసు తల్లడిల్లింది.

డిగ్రీ అయిపోతోన్న రోజుల్లో కలిశాడు ప్రసన్న. వొకే వీధిలో యిళ్ళు. వాళ్ళింట్లో పరిస్థితి అన్నిటికీ తడుముకునేటట్టే వుండేది. 'యెంత బాగా వాయిస్తావ్ వీణ... నువ్వు నేర్చుకుంటున్నది కూచిపూడా... భరతనాట్యమా... యేదైనా కానీ, నీ డ్యాన్స్ ప్రోగ్రామ్ పెడదామా... మ్యూజిక్ టీచర్ అవుతానని అన్నావట... టీచర్ కాదు ప్రొఫెసర్ కావాలి...' అని నా జవాబు కోసం చూసేవాడు.

'మొదలే ప్రొఫెసర్ యెలా అవుతారో తెలియదు,' అంటే జోక్స్ వేసేవాడు.

పెళ్ళి చేసుకుందాం అని అతను చప్పున అడిగాడో రోజు. అప్పుడు తనకేమనిపించిందో గుర్తు లేదు కానీ యింట్లో వాళ్ళు వొప్పుకోకపోతే వారిని కాదని పెళ్ళి చేసుకోవడం మాత్రం గుర్తుంది.

సువర్చలగారికి తన మేనకోడల్ని కోడలిగా తెచ్చుకోవాలని వుండేది. కానీ యింటిల్లి పాదికీ అతని సంపాదన తప్ప మరే ఆధారమూ లేదు. అయిష్టంగానే పెళ్ళికి వొప్పుకున్నారు. అప్పటికి పోర్ట్‌లో పనిచేస్తున్న ప్రసన్న మెల్లగా బాంబే చేరు కున్నాడు. అక్కడ అంది వచ్చిన యే అవకాశాన్నీ వదులుకోకుండా మెల్లగా టి.వి. రంగానికి వచ్చాడు. యాడ్ మార్కెట్‌కి అతను వేసిన వల టి.వి. తెరపై రంగుల్ని విరజిమ్మింది. ప్రసన్నతో పాటు మొత్తం కుటుంబం బాంబే వచ్చింది. చెల్లెళ్ళిద్దరికీ పెళ్ళిళ్ళు చేశాడు. బావగారిని తన పరపతితో మంచి వుద్యోగంలో పెట్టాడు. తన దగ్గర స్నేహితులకి బాంబేలో వో దారి చూపించాడు. తమ్ముళ్ళని మంచి కాలేజీలలో చదివించాడు. అతని చుట్టూ అతని వాళ్ళు, అతని స్నేహాలు.

పుట్టి పెరిగిన వూరి నుంచి దూరంగా వచ్చేశాను... తన యింట్లో వాళ్ళతో తిరిగి సంబంధాలు పెంచుకోవాలని తనెప్పుడు ప్రయత్నించినా అతను అయిష్టతని ప్రదర్శించేవాడు. 'పెళ్ళి చేసుకుంటామంటే వొప్పుకోని వాళ్ళతో తిరిగి మాటలేంటి' అనేవాడు. దిగులేసేది. వాళ్ళు ఫోన్ చేసినప్పుడే మాట్లాడాల్సి వచ్చేది. అతనికి యిష్టంలేని పని చేయడం అంటే అతన్ని ప్రేమించడం లేదనే అనుకునేవాడు. అతనికి నచ్చని పని చేయడానికి మనసొప్పేది కాదు. అతనికి తెలియకుండా యింట్లో వాళ్ళతో మాట్లాడినా గిల్టీగా అనిపించేది. దాంతో నా అంతట నేను ఫోన్ చేయడం మానుకున్నాను. ఫ్లాట్ కొన్నప్పుడు గృహప్రవేశం, సత్యనారాయణ స్వామి వ్రతం అన్నీ వాళ్ళ అమ్మానాన్నలచేతే చేయించాడు. తన యింట్లో వాళ్ళని పిలవాలని తన మనసెంతో లాగింది. చివరికి యెలాగోలా నోరు పెగుల్చుకొని అడిగితే, 'మనల్ని పెళ్ళి చేసుకోవద్దన్న వాళ్ళను పిలిచేదేంటి,' అన్నాడు.

వద్దన్నారు గానీ మనల్ని విడదీయాలనో, పెళ్ళి ఆపాలనో గొడవలేం చేయలేదు కదా. ప్రెగ్నెంట్‌గా వున్నప్పుడు డెలివరీకి తీసుకువెళతామని వచ్చినా పంపించలేదు. డెలివరీ టైమ్‌లో వచ్చినపుడు కూడా యిల్లు యిరుకు అంటే వాళ్ళు హోటల్లోనే వున్నారు.

"యిలా యింకెన్నేళ్ళు వాళ్ళని దూరంగా పెడతాం," అన్నాను.

"వాళ్ళు వచ్చినప్పుడు యేం అనలేదుగా."

"వాళ్ళని చూసి ముభావంగా నవ్వేవు తప్ప యేమైనా మాట్లాడావా," అని రెట్టిస్తే,

"యేంటీ యిష్టం పోయిందా... మీ వాళ్ళకోసం నాతో పోట్లాడుతున్నావ్," అన్నాడు.

అంతే ఆ మాటతో నోరు మూసుకుపోయింది.

యింటిని తనకి, తన అమ్మగారికి నచ్చినట్టు సర్దుకున్నాడు. మొదటిసారి కాలేజీలో వీణకచేరి చేసిన తర్వాత స్నేహితురాలు సుహాసిని వో పెయింటింగ్ యిచ్చింది. ప్రసన్నని పెళ్ళి చేసుకున్నప్పుడు యింట్లోంచి తెచ్చుకున్న వస్తువు అదొక్కటే. గోడకి తగిలించా దాన్ని. చాలా అందంగా అనిపించిందా గోడ.

"యేంటిది" అడిగాడు ప్రసన్న.

"సుహాసిని యిచ్చింది... గుర్తులే..."

"వో... కానీ యీ ఆరెంజ్ కలర్ అంటే నాకిష్టం లేదు."

నా చూపులు కిటికీ కర్టెన్స్ వైపు తిరిగాయి... ఆరెంజ్ కలర్ అతని ఛాయిస్.

పెయింటింగ్ తీసేసే వరకు యేదో వొకటి అంటూనే వున్నాడు నవ్వుతూనే. అతనికి నచ్చనిదానికి యెందుకులే గొడవ అనుకున్నా.

అత్తగారితో, ఆడపడుచులతో యేదో వొక అనీజీగా వుండేది. నాకు యెదురయ్యే చికాకులు వినడంపై అతనికి ఆసక్తి వుండేది కాదు. వీణ వాయిద్దామని యెప్పుడైనా వీణ తీస్తే చాలు, 'అబ్బా, యిప్పుడా' అనేవాడు. కేవలం అతని మీద వున్న యిష్టం వల్లే వీటన్నిటినీ భరించేదాన్ని. బాబు పుట్టాక ఐదారేళ్ళు ఫుల్ బిజీ. యింతలో అతని చెల్లెళ్ళ పురుళ్ళు, పిల్లలు... యిరవై యేళ్ళు యెలా గడిచిపోయాయో యేమో...

జూనియర్ కాలేజీలో చైతన్య జాయిన్ అవుతున్నప్పుడు, 'మీకు కాలేజీకి వెళ్ళే కొడుకున్నాడంటే యెవ్వరూ నమ్మరు,' అని పక్క ఫ్లాట్‌లోకి కొత్తగా వచ్చినావిడ కాంప్లిమెంట్ యిస్తే తనని తాను చూసుకుని మురిసిపోయింది.

అప్పటివరకు అద్దం ముందు నిలబడి చూడాలనే ఆలోచనే రాలేదు.

కాలేజీ డేస్‌లో కూడా తనని అంతా మిస్ కాలేజ్ అంటుండేవారు.

సరయూ వైపు ప్రసన్న చూపులు తిరుగుతున్నాయని స్మెల్ చేసినప్పటి నుంచీ మనసంతా బేలగా అయిపోయింది. పరిపరి విధాల పోయింది.

మరో పాట వేయరాదా... నవ్వుతూ గట్టిగా అంటోంది గీత.

మయూర హాల్లో వున్న వాళ్ళందరవైపూ చూసింది. సరయూ అందమే యింట్లో వాళ్ళని యింత ఆకర్షించిందా!

అంత అందమైన సరయూకి తన సంసారాన్ని బ్రేక్ చేస్తే కానీ బ్రేక్ యెందుకు రాలేదో... ఐటమ్ సాంగ్స్ రెండు చేయగానే ప్రొడ్యూసర్స్‌కి బోర్ కొట్టింది. ఆమెకి మిగిలింది టి.వి. అవకాశాల కోసం ప్రయత్నిస్తోండగా ప్రసన్న పరిచయం అయ్యాడు. ప్రసన్న ఆమెతో డిజైన్ చేసిన ప్రోగ్రామ్ క్లిక్ అయ్యింది. ప్రసన్న చుట్టూ మరో ప్రపంచం వుందని ప్రసన్న, సరయూ యిద్దరూ మరిచిపోయారు. ప్రసన్నని తిరిగి తనవైపు తీసుకురావడం యెలా అని ఆలోచిస్తున్నప్పుడు యెవరితో నైనా మాట్లాడితే బాగుండుననుకొంది.

యెవరితో... అప్పుడు స్పష్టంగా తెలిసొచ్చింది... తను యెంత ఒంటరిదో.

యెవరితోనూ యేమీ చెప్పుకోలేక మ్యాగజైన్స్‌లో వ్యక్తిగత సమస్యలకి జవాబులు చెప్పేవాళ్ళకి మారుపేరుతో వుత్తరం రాసింది. యంగ్‌గా, ఆకర్షణీయంగా కనిపించడానికి ప్రయత్నించమని జవాబు.

యెంత యంగ్‌గా... యెంత ఆకర్షణీయంగా... మరిన్ని వర్క్‌వుట్స్... మరింత డైట్... మరిన్ని ఫేషియల్స్. శరీరం అలసిపోతోంది. మనసూ అలసిపోతోంది. నిద్రా నిద్రా... అంటుంటే కనురెప్పలు మూసుకుంటాయి. హృదయం ససేమిరా కాదంటుంది. కలతనిద్ర... డిస్టర్బ్‌డ్ స్లీప్...

"యేరా కన్నా! యెక్కడికి వెళ్ళావురా కొండా," సువర్చలగారు చైతన్యని ముద్దు చేస్తున్నారు.

ఆమెకి మయూర పట్ల వున్న కోల్డ్‌నెస్ చైతన్య పట్ల లేదు. చైతన్యకి అన్నం పెడుతున్నారామె. అలా కాసేపు తేరిపార చైతూ మొహంలోకి చూస్తుండిపోయింది మయూర. అమాయకత్వం, వుత్సాహం నిండిన ముఖం. తమిద్దరి నడుమ జరుగుతున్న ఘర్షణ నీలినీడలేమీ సోకని నిశ్చింత చూపులు.

సరయూ అంత అందంగా తయారవ్వాలని ఆమెతో పోటీపడడం... అలసటొ స్తోంది. బరువు తగ్గిపోగలను కానీ ఆమె అంత పొడవు కావడం యెలా... యేం చేసినా ఆమె తన కంటే వయస్సులో యిరవైయేళ్ళ చిన్నది. తన వయస్సుని యెలా తగ్గించుకోగలదు...

అసలిదంతా యెలా మొదలయ్యింది.

అతనికి కావల్సినట్టే వుంది... తనకి అతనిపై ప్రేమ వుందని అతనికి తెలియదా...

యెందుకీ చికాకు అని అడిగితే... తనకి తెలిసిపోయిందని తెలిస్తే మరింత తెగింపుతో ప్రవర్తిస్తాడేమో. యింటికి పూర్తిగా రాడా... లంచ్ ఆఫీసులో, డిన్నర్ బయటే చేసొచ్చానంటున్నాడు. అప్పుడీ బ్రేక్‌ఫాస్ట్ కూడా చేయడా...

'అసలు యిప్పుడు యేమయింది,' అని అతను అడిగితే.

ఆనవాలు కావాలి కదా... లేకపోతే దబాయిస్తాడు.

మయూర టైమ్ చూసింది. యెనిమిదవుతోంది.

ప్రసన్నకి ఫోన్ చేసింది. అతను లిఫ్ట్ చేసి ఆమె యేమంటుందో కూడా పట్టించుకోకుండా, 'బిజీగా వున్నా,' అని డిస్కనెక్ట్ చేశాడు.

పదిన్నర అవుతోంటే మయూరలో వలయాలు వలయాలుగా అసహనం. చెప్పు లేసుకొని బయటకొచ్చింది. అప్పటికి డ్రైవర్ వెళ్ళిపోతాడని తెలుసు. దారిన పోయే టాక్సీని ఆపి ప్రసన్న ఆఫీసు వైపు వెళ్ళింది. కార్లు అన్నీ సెల్లార్ పార్కింగ్‌లో కదా, అతను వున్నా తెలీదు. అక్కడ దిగి పార్కింగ్‌లోకి వెళ్ళి చూడాలంటే తనెవరో చెప్పాలి. లేకపోతే యీ వేళప్పుడు ఆ కాంప్లెక్స్‌లోకి వెళ్ళడం కష్టం. తనెవరో చెబితే ప్రసన్నకి తెల్సిపోతుంది. ఆలోచించి సరయూ యింటివైపు పోనివ్వమని టాక్సీ అతనికి చెప్పింది. అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్ లోపలికి విజిటర్స్ కార్లని రానీయరు కదా... బయటే యెక్కడో పార్క్ చేసుంటుంది కదా... ఆ అపార్ట్‌మెంట్ బయట అటూ యిటూ చూసొచ్చింది కానీ కారు కనిపించలేదు. అతని మొబైల్‌కి ఫోన్ చేస్తే నో రెస్పాన్స్. కచ్చితంగా సరయూతోనే వుండి వుంటాడు. అందుకే ఆన్సర్ చేయడంలేదు. ఆమె ఫ్లాట్‌కి వెళితే... నో... వద్దు... మర్యాద కాదు... వాళ్ళకి తనపట్ల యే గౌరవమూ లేనప్పుడు తనెందుకు వాళ్ళకి గౌరవం యివ్వాలి... మయూరా! వెళ్ళిపో... యింటికి వెళ్ళిపో... యింత పెద్ద మహా నగరంలో వాళ్ళని యెక్కడని పట్టుకుంటావ్...

మయూర తన ఆందోళనలో టాక్సీ డ్రైవర్‌లో మారుతోన్న రకరకాల చూపులని అస్సలు పట్టించుకోలేదు.

యింట్లోకొచ్చేసరికి పన్నెండయ్యింది. తలుపు తీసిన సువర్చలగారు, "యెక్కడికి వెళ్ళావ్," అని గుచ్చిగుచ్చి అడిగారు.

మౌనం...

ఆవిడ పడుకోడానికి వెళుతుంటే, "అత్తయ్యా," అని పిలిచింది.

అడగాలనుకుంది యేమిటో స్పష్టంగా ఆలోచించుకోకపోవడం వల్ల చప్పున యేం మాట్లాడితే యేంటోనని, "యేం లేదు," అనేసింది. సరయు, ప్రసన్నల స్నేహాన్ని ఆవిడెలా తీసుకొంటున్నారో తెలుసుకోవాలని వుంది. కానీ... ఆలోచిస్తూనే గదిలోకి నడిచింది మయూర.

యెన్నో యేళ్ళుగా అతనికి నచ్చినట్టుగా బతకడమే అతన్ని ప్రేమిస్తుందనడానికి ఆనవాలుగా బతికింది తను. యెన్నో విషయాల్లో సర్దుకొంది. భరించింది. యిప్పుడు అతని యీ స్నేహాన్ని మాత్రం తనెందుకు భరించలేకపోతోంది... అతను మరో అమ్మాయికి యిస్తున్న స్థానాన్ని వొప్పుకోవడానికి మనసు యెదురు తిరుగుతోంది యెందుకు... యేమయింది యీ యిరవై యేళ్ళూ...

వొక్కసారిగా దుఃఖం వచ్చేసింది.

అతన్నుంచి విడిపోతే... చైతన్య... యేమైపోతాడు!

వాడంటే ప్రసన్నకి యెంత యిష్టం... పిల్లాడు గుర్తు రాలేదా యిలాంటి స్నేహం లోకి వెళ్ళినప్పుడు. యీ పెళ్ళితో తను తన యింట్లో వాళ్ళకి, స్నేహితులకి దూరం అయ్యింది.

దుఃఖం మరింత వుధృతం అయ్యింది.

కన్నీళ్ళతో అలసిపోయి హాల్లోకి వచ్చింది.

ఆకలి...

ఫ్రిజ్ తీసింది.

ఫ్రూట్‌జ్యూస్ ప్యాకెట్‌ని తీయబోతూ ఆగింది.

అన్నం ఆకలి... తిను మయూర... నువ్వు ఆరోగ్యంగానే వున్నావ్. నీ కొలెస్ట్రాల్ లెవెల్స్ కంట్రోల్లోనే వున్నాయి... తిను మయూర...

కడుపు నిండుగా అన్నం తిని, వో స్వీట్ ముక్క కూడా తిని బాల్కనీలోకి వచ్చింది.

కాలింగ్‌బెల్ మోగింది.

ప్రసన్న...

'అన్నం పెట్టనా.'

వద్దన్నట్టు తలాడించాడు.

గదిలోకి వెళ్ళి బట్టలు మార్చుకొని నిద్రపోవడానికి వెళ్ళే ముందు వొకసారి చైతన్య గదిలోకి వెళ్ళాడు. తిరిగొచ్చి నిద్రపోయాడు. అదే మంచంపై వో పక్కకి తిరిగి పడుకొంది మయూర. యిటు తిరిగి ప్రసన్నవైపు చూసింది.

ఐదడుగుల తొమ్మిదంగుళాల పొడవు చక్కగా మెయింటైన్ చేస్తున్న ఫిజిక్... నలభై రెండేళ్ళు అన్నట్టే వుండడు. అతని భుజం వంపులో తలాన్చి అతని యెడమ చేయి తన కుడిచేతిపై వుంచి దగ్గరికి తీసుకోగానే నిశ్చింతగా నిద్రపోవడం తన కెంతో యిష్టం.

యిప్పుడు తను తలాన్చినా అతని చేతులు తనని దగ్గరకి తీసుకోవడంలేదు. తనేం చేసిందని తన పట్ల యింత నిరాసక్తత.

దిగులుతోనే యెప్పుడో కలత నిద్ర పట్టింది.

ఆరోజు యేదేమైనా అతనితో మాట్లాడాలని అనుకొని, "మనం యెందుకిలా వుంటున్నాం," అని అడిగింది.

ఆదివారం వుదయం బద్ధకంగా టి.వి. చూస్తున్న అతను స్క్రీన్‌పై నుంచి తల కూడా తిప్పకుండా, "యెలా," అన్నాడు.

"నీకు తెలీదా ప్రసన్నా."

అతను మాట్లాడలేదు. కాసేపాగి టి.వి. ఆఫ్‌చేసి, "నేనిలానే వుంటా..." అన్నాడు.

"బాధేస్తోంది."

"నేనేం చేయలేను."

"అలా అంటే యెలా ప్రసన్నా. యిలా హర్ట్ చేయటం కరెక్ట్ కాదుకదా," అన్నా.

"నీకేది కరెక్టో, నిన్నేది హర్ట్ చేస్తుందో యివన్నీ ఆలోచించే వోపికా తీరికా లేదు. నేనింతే. యిలానే వుంటా," ఖరాఖండీగా చెప్పేశాడు.

"నేను," అయోమయంగా, అమాయకంగా అడిగాను.

"నీ యిష్టం."

యిష్టం... నాకేం యిష్టం... అతనికి యిష్టమైనది చేయడమే యిష్టంగా బతికి తనకి యిప్పుడింత హఠాత్తుగా యేం యిష్టమో స్ఫురించడంలేదు.

అతను బయటికి వెళ్ళిపోయాడు.

ఆ మధ్యాహ్నం అత్తగారిని అడిగింది మయూర, "ప్రసన్నలో మార్పు మీకు తెలుస్తోందా," అని.

మయూర ఆ విషయం యెప్పుడు అడుగుతుందా అని యెదురుచూస్తున్నట్టు న్నారేమో సువర్చలగారు, "ప్రసన్న యే నిర్ణయం తీసుకున్నా నాకు యిష్టమున్నా లేకపోయినా నేనేమీ అనను. నిన్ను చేసుకుంటాను అన్నప్పుడూ మేమేమీ అనలేదుగా. నా మేనకోడలికి అన్యాయం జరుగుతుందనే బాధ వున్నా సహిం చాను," అన్నారామె.

"యిప్పుడు మీ మేనకోడలు మీ కోడలు కానందుకు, ఆమెకి నాకొచ్చినంత కష్టం యెదురు కానందుకు సంతోషిస్తున్నారా" మళ్ళీ అంది మయూర.

"నా మేనకోడలికి యిలాంటి కష్టం యెందుకొస్తుంది... రానిస్తామా! వాడిక్కూడా సొంత మేనమామ కూతురని వుంటుంది. అయినా యిప్పుడు నీకేమయ్యిందని, వాడేమీ ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోవడం లేదుగా."

మయూర ఆవిడవైపు చిత్రంగా చూసింది.

"యిదిగో. మగవాళ్ళకి యిలాంటివేవో వుంటుంటాయి. మా మావగారికీ వుండేది. మా అత్తగారు వూరుకోలేదా... మధ్యలో వచ్చినవి మధ్యలోనే పోతాయి. వాటిని రాద్ధాంతం చేయకూడదు. వోపిక పట్టు. నీకు తెలిసింది కాబట్టి యిలా అంటు న్నావు. తెలియకపోతే యేం చేసుండేదానివి. తనొచ్చి యీ యింట్లో లేదుగా," అందావిడ సింపుల్‌గా.

మయూర ఆలోచిస్తూ వుండిపోయింది.

ఆ రాత్రంతా మనసు పరిపరివిధాలుగా పోతూనే ఉంది.

చివరికి వో నిర్ణయానికి వచ్చింది.

వుదయం ప్రసన్న ఆఫీసుకి బయలుదేరుతుంటే, "ప్రసన్నా, కొంత డబ్బులు

కావాలి. వైజాగ్ వెళుతున్నా," అంది.

"యెందుకు"

"స్పష్టంగా తెలీదు. కొద్దిరోజులు వెళతా," అంది.

"డబ్బులు అమ్మని అడుగు," అన్నాడు.

"అడగను. నువ్వే అడిగి యివ్వు,' అంది.

ప్రసన్న ప్రతి నెలా డబ్బులు తల్లికే యిస్తాడు. యింటికి కావల్సినవన్నీ ఆమే చూస్తారు. అతనెప్పుడూ మయూరకి పాకెట్ మనీ కూడా యివ్వలేదు. బ్యూటీ పార్లర్‌కి వెళ్ళాలంటేనో, టైలర్‌కి యివ్వడానికో... యిలాంటి అవసరాలకి యెన్ని డబ్బులు అవసరమో అంతవరకే యిచ్చేవారు యిద్దరూ మయూరకి.

కొద్ది రోజులు వైజాగ్ వెళ్ళొస్తానని చెప్పింది చైతన్యకి. తనని వదిలి తల్లి యెప్పుడూ యెక్కడికీ వెళ్ళడం తెలియని చైతన్య వింతగా చూస్తూ, "అమ్మమ్మ యింటికా," అన్నాడు. అవునన్నట్టు తలూపింది.

యిక్కడి వాళ్ళంతా చైతన్యని ప్రేమగా చూస్తారని తెలుసు. అందుకే ధైర్యంగా బాబుని వదిలి విశాఖ బయలుదేరింది.

విశాఖ... యీ యిరవై యేళ్ళలో యెంత మారిపోయిందో...

రెండ్రోజులు అమ్మావాళ్ళతో గడిపి సుహాసినిని చూసొస్తానని వాళ్ళింటికి వెళ్ళింది.

సుహాసిని సంబరపడిపోయింది.

పిల్లలిద్దర్నీ యెంసెట్‌కి రుద్దుతున్న బిజీలో వున్నానని చెప్పింది.

"ఫిజిక్ బాగా మెయిన్‌టైన్ చేస్తున్నావే. యోగాకి, వాకింగ్‌కి వెళుతున్నాను కానీ డైటింగ్ చేయలేకపోతున్నాననుకో," అంటూ గట్టిగా నవ్వింది.

కాఫీ తాగుతూ, "వూరు బాగా మారిపోయింది. పేపర్లలో చదువుతున్నా చూడటం వేరు కదా," అంది మయూర.

"ఆ... యెంత మారినా బాంబే అంత అవ్వదు కదా," అంది సుహాసిని.

సుహాసినికి యిలాంటి బాధలేమీ లేనట్టున్నాయి. యెంత హాయిగా వుందో అనుకోగానే మయూరకి నవ్వొచ్చింది.

యెవరి గుండెలో బాధలు వారికి మాత్రమే తెలిసే యీ కాలంలో మాటలు, నవ్వుల ప్రవాహాన్ని చూసి గుండెల్లో దాగి వున్న వ్యధలు తెలుసుకోలేం కదా.

"యెంతో యిష్టపడి పెళ్ళి చేసుకుని యీ వూరినీ, అందరినీ వదిలి వెళ్ళినందుకు అంతా గర్వపడే స్థాయికి ప్రసన్న యెదగడం సంతోషంగా వుందనుకో,' అంది సుహాసిని.

యీ వూరిలో తను నిలబడగలదా...

అందరినీ అవునని వెళ్ళినా, కాదని వెళ్ళినా యిప్పటి యీ పరిస్థితుల్లో పెద్ద తేడా యేమీ వుండదు. కానీ యిప్పుడు తిరిగి యిక్కడ తను కొత్త జీవితాన్ని మొదలుపెట్టాలనుకుంటే మాత్రం తలా వొక మాట ప్రేమగానో, జాలిగానో, సానుభూతితోనో అంటారు. కానీ...

బాంబేలో అదే యింట్లో వుంటూ రోజూ ప్రసన్నని అలా చూడడం బాధగా, అవమానకరంగా వుంది. పది రోజులు విశాఖలో గడిపి బాంబే తిరిగి వచ్చింది.

"అబ్బా... వచ్చేశావా... పిచ్చిపిల్లలా తిరక్కు. యిప్పుడు వీడి దగ్గర అవకాశాలేవో వున్నాయి. ఆ అమ్మాయి సరదాగా తిరుగుతుంది. రేపు మరొకరి దగ్గర అవకాశా లుంటే అటే వెళ్ళిపోతుంది. ఆ మాత్రానికే నువ్వు అటూ యిటూ వెళ్ళడం యెందుకు," అన్నారు సువర్చలగారు.

మౌనంగా ఆవిడవైపు చూసింది మయూర.

ప్రసన్న తిరిగొస్తాడా... ఆ అమ్మాయి వెళ్ళిపోతుందా... లేక మరో అమ్మాయి వస్తుందా... యివన్నీ యిప్పుడు అనవసరం... నేనేం చెయ్యాలి... అసలు నేనేంటి...

గెస్టరూమ్‌లో తనకి కావల్సినవన్నీ సర్దుకుంది. సుహాసిని యిచ్చిన పెయింటింగ్‌ని గోడకి తగిలించింది.

"యేమిటిదంతా," అడిగారు సువర్చలగారు.

"యిక నుంచి నేనీ గదిలోనే వుంటా. పూర్తిగా యీ యింటిని వదిలి వెళ్ళిపోవ డానికి చైతన్య వల్ల మనసొప్పడం లేదు. మరికొంత కాలం పోతే చైతన్య మరింత యిండిపెండెంట్ అవుతాడు. మా యిద్దరి మధ్య వచ్చిన తేడాకి తను బాధపడ

కూడదు. చైతూకి బాగా అలవాటైన యింటి నుంచి, మనుష్యుల నుంచి, కాలేజీ నుంచి దూరం చేయడం నాకు యిష్టం లేదు.

"నేనూ చైతూకి దూరంగా వుండలేను. యిక్కడే యీ యింట్లోనే వుంటా. నేర్చుకున్న సంగీతాన్ని మరింత నేర్చుకోవాలనుకుంటున్నా. అక్కడే చిన్నపిల్లలకి సంగీతం నేర్పే చిన్న వుద్యోగం చూసుకుంటాను. నలభై యేళ్ళ వయస్సులో వొక్కసారిగా అన్ని రకాలుగా నిలబడటం వెంటనే వీలు కాకపోవచ్చు.

"కానీ అసాధ్యం మాత్రం కాదు. ప్రసన్న మనసు నుంచి వెళ్ళిపోయానని తెలిశాక కూడా చైతు కోసం యీ యింట్లో అతిథిగా వుండటానికే నిశ్చయించుకున్నా" యివన్నీ సువర్చలగారికి చెబితే యెంతవరకు అర్థం అవుతుందో తెలియదు. రోజులు గడుస్తుంటే అవే అర్థం అవుతాయిలే ప్రత్యేకంగా చెప్పడం యెందుకు.

✦

రాత్రి... సమయం వొంటిగంట. కాలింగ్‌బెల్ మోగుతూనే వుంది.

మెలకువ వచ్చినా మయూర లేచి వెళ్ళి తలుపు తీయలేదు.

మెలకువ వచ్చినా మయూర తీస్తుందిలే అని యెప్పటిలా పక్కకి తిరిగి పడుకొన్న సువర్చలగారు యెంతసేపైనా మయూర తీయకపోవడంతో లేచి వెళ్ళి తలుపు తీశారు.

యింట్లో తను అంటూ వొకడున్నాడనే స్పృహే లేనట్టు మయూర మ్యూజిక్ స్కూల్‌కి వెళ్ళడం, చైతన్యతో రెస్టారెంట్‌కో, గుడికో, సినిమాకో యెక్కడోక్కడికి వెళ్ళడం చూస్తుంటే తనని డిస్టర్బ్ చేయనందుకు ముందు రిలీఫ్‌గా ఫీలయినా మెల్లమెల్లగా అనీజీనెస్ అతనిలో.

యిన్నాళ్ళూ తనని యిష్టపడినవారి కోసం అన్నీ మరిచిపోయి బతికిన మయూర యిప్పుడిప్పుడే తనని తాను ప్రేమించడం మొదలుపెట్టిందని ప్రసన్నకి యింకా అర్థం కాలేదు.

"యిల్లేం పట్టనట్టు నీ దారిన నువ్విలా వుంటే యెలా," సువర్చలగారు వొకరోజు చికాకుగా అన్నారు మయూరతో.

"అన్నీ తెలిసీ నన్నే అడుగుతారేంటి" మయూర నిర్లిప్తంగా జవాబిచ్చింది.


ఆమె మౌనంగా గదిలోంచి వెళ్ళిపోయారు. యెప్పటిలా ఆ రాత్రి ఆలస్యంగా వచ్చిన ప్రసన్నతో "తను అలా వున్నా పట్టించుకోవేం. యింట్లో పిల్లాడున్నాడు. మన ఆడపిల్లల్ని వాళ్ళ మొగుళ్ళు అడుగుతారు కదా. యేదోలా వొప్పించి తను మామూలుగా వుండేట్టు చూడు. అటు విడిపోవడం కాదు, యిటు కలిసుండటమూ కాదు. యేంటీ పద్ధతి!" రవ్వంత విసుగు ఆమె స్వరంలో.

"విడిపోతే తనకి కాంపెన్సేషన్ యివ్వాలి. విడిపోయేంత తగాదా కూడా మా మధ్య లేదు. అన్నింటి కంటే ముఖ్యం చైతూకి అమ్మ కూడా కావాలి. మా యిద్దరిలో యే వొక్కరు దూరం అయినా వాడెలా తీసుకుంటాడో తెలీదు. కెరీర్‌కి పునాది పడే వయస్సులో వాడిని డిస్ట్రబ్ చేయడం నాకు యిష్టం లేదు. మయూర మన జోలికి రానప్పుడు తనెలా వుంటే నీకేం... నువ్వూ పట్టించు కోకు," అంటూ గదిలోకి వెళ్ళిపోయాడు.

'యిదంతా యేమిటో... రాత్రనకా పగలనకా కష్టపడి యింత సంపాదించాడు... యిందులో తనకి కొంత యివ్వాలంటే... అమ్మో... సరేలే, చైతూ కోసమైనా సర్దుకుందాం... కొన్నాళ్ళకి పరిస్థితి మారొచ్చు,' అనుకున్నారామె.

✦

వుదయమే లేచి మయూర యెప్పటిలానే యోగా చేస్తోంది. యిప్పుడు ఆమె శరీరమే కాదు చూపులు కూడా ఫ్రెష్‌గా మెరుస్తున్నాయి.



*ఆదివారం ఆంధ్రజ్యోతి*
*18 డిసెంబర్ 2005*